# తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387



PUBLISHED: HYDERABAD, JANGAON    సంపుటి :01    సంచిక :106    బుధవారం    16 సెప్టెంబర్ 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-


## గురుకులంలో కుళ్లిన కూరగాయల బాగోతం

# విద్యార్థుల ఆరోగ్యంతో అధికారులు చెలగాటం!

- "ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి" -- ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీకి మెస్ సిబ్బంది బెదిరింపు ధోరణి!
- విద్యార్థుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా? మల్లంపల్లి గురుకులంపై ఉన్నతాధికారులు వెంటనే కొరడా ఝుళిపించాలి!









**తెలుగు గళం మల్లంపల్లి (ములుగు), సెప్టెంబర్ 15:**

మల్లంపల్లిలోని ఏటూరునాగారం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)లో విద్యార్థులకు నాణ్యత లేని, కుళ్లిపోయిన కూరగాయలతో భోజనం వండుతున్నారంటూ పేరెంట్స్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిటీ ఆరోపించింది. మంగళవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్షం రాజ్‌కుమార్ పాఠశాలలోని వంటగది, భోజనశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా కుళ్లిపోయిన క్యాబేజీ, చిక్కుడుకాయలు, టమాటాలు కనిపించాయని తెలిపారు. పనికిరాని కూరగాయలను విద్యార్థుల చేతే శుభ్రం చేయిస్తూ, వాటినే వంటకు వినియోగిస్తున్న పరిస్థితి కనిపించిందని ఆరోపించారు. ఇది విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్‌తో మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ దురుసుగా




వ్యవహరించారని, తనిఖీ చేసే అధికారం మీకెవరిచ్చారంటూ ప్రశ్నించారని కమిటీ ఆరోపించింది. విద్యార్థుల భోజనం, ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రుల ప్రతినిధులు ప్రశ్నించడం సహజమైన బాధ్యత అయినప్పటికీ, వారితో అనుచితంగా మాట్లాడటం సరికాదని పేర్కొంది. అదేవిధంగా, సమస్యను పరిష్కరించాల్సిన ప్రిన్సిపాల్ కూడా మెస్ ఇన్‌ఛార్జ్‌కు మద్దతుగా మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీని ప్రశ్నించడం మరింత ఆందోళన కలిగించిందని కమిటీ తెలిపింది. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని ఆరోపించింది. పేద, గిరిజన కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న గురుకుల పాఠశాలలో ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించరాదని పేరెంట్స్ కమిటీ స్పష్టం చేసింది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదా లేదా అనే అంశంపై ఉన్నతాధికారులు తక్షణమే ఆకస్మిక తనిఖీ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని కోరింది. జోనల్ అధికారి (జెడ్ఓ), ములుగు జిల్లా సంక్షేమ అధికారి (డీసీఓ) వెంటనే స్పందించి పాఠశాలను తనిఖీ చేసి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. ఆరోపణలు నిజమని తేలితే మెస్ ఇన్‌ఛార్జ్, ప్రిన్సిపాల్‌పై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సస్పెండ్ చేయాలని కోరింది. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పేరెంట్స్ కమిటీ హెచ్చరించింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, సరైన మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసింది.

# ఏపీ రాజకీయాల్లో మరో విషాదం!


2 లో

న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం): ఏపీ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో మరణించారు. విశాఖలోని తన నివాసంలో నాని కన్నుమూసినట్టు సమాచారం.

# విజయవాడలో బాంబుల కలకలం!



2 లో

- ఆర్టీసీ బస్సులో పేలుడు పదార్థాలతో కలకలం
- ప్రయాణికుడి అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- బ్యాగులో 46 జిలెటిన్ స్టిక్స్.. 50 డిటోనేటర్లు
- బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు
- పేలుడు పదార్థాలు ఎక్కడికి తరలిస్తున్నారు?
- సీసీటీవీ ఫుటేజీలతో పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- విజయవాడలో భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు

# ఉద్యోగులతో పెట్టుకుంటే ఓటమి ఖాయం!


2 లో

- ఉద్యోగులతో పెట్టుకున్నవాళ్లు మళ్లీ గెలవలేదు
- కాంగ్రెస్ సర్కార్ ఓటమి ఖాయమన్న కవిత
- ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం ఎందుకు?
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు
- విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ఉద్యోగులను అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం

# ఫలక్‌నుమా వేదికగా కీలక భేటీ!

- రహీమ్ ఆగా ఖాన్‌తో రేవంత్ భేటీ
- వారసత్వ కట్టడాలపై ప్రత్యేక ఫోకస్
- పాతబస్తీ అభివృద్ధికి సహకారం కోరిన సీఎం
- మూసీ పునరుజ్జీవంపై కీలక చర్చ
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరణ
- మూసీ పరివాహక ప్రాంతంలో నైట్ ఎకానమీ
- ఫ్యూచర్ సిటీకి భారీ ప్రణాళికలు
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని చారిత్రాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వారసత్వ సంపద పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, పాతబస్తీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణ వంటి పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని చారిత్రాత్మక భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు ఎంతో గౌరవం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోని వారసత్వ కట్టడాలను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

ఆగా ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కుతుబ్‌షాహీ టూంబ్స్ పునరుద్ధరణలోనూ ఆగా ఖాన్ ఫౌండేషన్ భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. 2 లో

# ఎర్రవల్లి కేసులో ప్రభుత్వానికి షాక్!

- ఎర్రవల్లి శుద్ధి వివాదంపై హైకోర్టు కీలక ఆదేశాలు
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దని ఆదేశం
- నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని స్పష్టం
- ఏడేళ్లలోపు శిక్ష సెక్షన్లపై కోర్టు ప్రశ్నలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విస్మరించడంపై ఆగ్రహం
- పోలీసుల దూకుడుకు హైకోర్టు బ్రేక్ 2 లో
- కాంగ్రెస్ ప్రభుత్వానికి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ

# శంకర్‌పై రౌడీషీట్ రీ-ఓపెన్!

- బెదిరింపుల ఆరోపణలపై పోలీస్ యాక్షన్
- 2019లో మూసిన షీట్ పునరుద్ధరణ
- బిల్డర్ ఫిర్యాదుతో దందాలు వెలుగులోకి
- కుటుంబాన్ని చంపేస్తామంటూ బెదిరింపులు
- పలు పోలీస్ స్టేషన్లలో కేసులు
- ప్లాట్ల విక్రయంపైనా ఆరోపణలు
- వరుస కేసులతో దర్యాప్తు వేగవంతం


2 లో

**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** బెదిరింపులు, అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై చిన్నబోయిన శంకర్ అలియాస్ 'అంబర్‌పేట్ శంకర్'పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అతడిపై రైడీషీట్ ను తిరిగి ఓపెన్ చేశారు. సత్ప్రవర్తన కింద శంకర్‌పై గతంలో నమోదైన రౌడీషీట్‌ను 2019లో పోలీసులు మూసివేశారు. అయితే ఆయనపై ఇటీవల వరుసగా తీవ్రమైన నేరారోపణలు వెలుగులోకి రావడం, కొత్త కేసులు నమోదు కావడంతో అంబర్‌పేట్ పోలీసులు గతంలో మూసివేసిన రౌడీషీట్‌ను పునరుద్ధరించినట్లు సమాచారం.

బిల్డర్ జి.అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇటీవల శంకర్ దందాలు మళ్లీ బయటపడ్డాయి.

# విజయవాడలో డివిజన్ల భారీ పెంపు!

- విజయవాడ కార్పొరేషన్‌లో డివిజన్ల భారీ పెంపు
- 64 నుంచి 86కు డివిజన్ల సంఖ్య పెంపు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- 86 డివిజన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు
- జనాభా పెరుగుదలతో పునర్వ్యవస్థీకరణ
- వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి అవకాశం
- అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత చేరువ

2 లో

# యువతదే దేశ భవిష్యత్ బాధ్యత!

- దేశం మనకేం చేసిందని కాదు.. 2 లో
- మనం ఏం చేయగలమో ఆలోచించండి
- జెన్ జీ, జెన్ ఆల్ఫా మాటలు వినేందుకు సిద్ధం
- యువత నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలి
- దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి
- మోదీ నాయకత్వంలో భారత్ ఆర్థిక పురోగతి
- తమిళనాడులో ఉద్యోగ అవకాశాలకు కొత్త ఊతం
- మహిళా సాధికారతకు కేంద్రం ప్రత్యేక చర్యలు

# ఎర్రవల్లి కేసులో ప్రభుత్వానికి షాక్!



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన ఎర్రవల్లి పసుపు నీళ్లతో శుద్ధి వివాదంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో నమోదైన కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం నోటీసులు మాత్రమే ఇచ్చి దర్యాప్తు జరపాలని తేల్చిచెప్పింది. ఇక ఇరు పక్షాల వాదనలు వినిపిస్తున్న క్రమంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో నిందితులను ఎలా అరెస్టు చేస్తారంటూ ప్రభుత్వ తీరును కోర్టు మందిలిస్తూ గట్టిగా ప్రశ్నించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిని విస్మరించి మళ్లీ ఎలా అరెస్టులకు పాల్పడతారంటూ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది.

కాగా, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం, ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తూ అరెస్టులకు సిద్ధమవ్వగా, ఆ అరెస్టును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని పోలీసులను హెచ్చరిస్తూ తదుపరి చర్యలకు బ్రేక్ వేసింది.

# యువతదే దేశ భవిష్యత్ బాధ్యత!



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశం మనకేం చేసిందో కాకుండా దేశానికి మనం ఏం చేయగలమో ఆలోచించాలని అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ యువతకు పిలుపునిచ్చారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమేనని అయితే మీరు మిమ్మల్ని జెన్ జెడ్ అని పిలుచుకున్నా, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా, మీరందరూ చెప్పేది వినడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది?మీ పాత్ర ఏమిటి? మీ ద్వారా దేశానికి ఏమి సాధించవచ్చు అనే విషయాలపై మీరు తప్పక ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత నాయకత్వ బాధ్యతలను స్వీకరిస్తూ దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

యువతదే బాధ్యత:

పట్టభద్రులవుతున్న విద్యార్థులు వారి వారి రంగాలలో నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని నిర్మలా సీతారామన్ కోరారు. మీరు నాయకత్వం వహించాలి, దేశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దేశం సురక్షితంగా, బలంగా ఉన్నప్పుడే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. మనం మన దేశాన్ని ఎన్నటికీ వదులుకోకూడదని సూచించారు. రష్యా-యుక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వంటి ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధి రేటును సాధించి స్థిరంగా ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరిగిన ఉపాధి అవకాశాలను వివరిస్తూ శ్రీపెరంబుదూర్-ఒరగడం కారిడార్ నేడు ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకు ప్రపంచ కేంద్రంగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో దాదాపు 10 శాతం (350 కేంద్రాలు) ఒక్క తమిళనాడులోనే ఉన్నాయని తెలిపారు.

మహిళా సాధికారతపై..

మహిళలు ఉద్యోగ రంగాల్లోకి రావడం కోసం STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విద్యను పూర్తి చేసిన వారి కోసం ప్రతి జిల్లాలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. తిరుక్కురళ్ లోని పద్యాలను ఉదహరిస్తూ.. యువత ఎంతటి విజయాలు సాధించినా అహంకారాన్ని పక్కనబెట్టి, వినయం, సహనంతో సవాళ్లను ఎదుర్కోవాలని కొత్తగా పట్టాలు పొందిన విద్యార్థులకు ఆమె హితవు చెప్పారు.

# విజయవాడలో డివిజన్ల భారీ పెంపు!




**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించడంతో పాటు, ప్రజలకు మెరుగైన పాలన అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల సంఖ్యను పెంచుతూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా నిర్ణయంతో ఇప్పటి వరకు ఉన్న మొత్తం 64 డివిజన్లను ఏకంగా 86కు పెరిగాయి.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా..

రాబ్యే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిగా కొత్తగా ఏర్పాటైన 86 డివిజన్ల ప్రకారమే నిర్వహించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీవో విడుదల కావడంతో ఎన్నికల ప్రక్రియ దిశగా అడుగులు పడుతున్నాయి. నగర జనాభా పెరుగుదల, భౌగోళిక విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. దీంతో వార్డుల వారీగా సమస్యల పరిష్కారం సులభం కావడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత చేరువవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఉద్యోగులతో పెట్టుకుంటే ఓటమి ఖాయం!

**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** ఉద్యోగులతో పెట్టుకున్న వాళ్లెవరూ మళ్లీ అధికారంలోకి రాలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఓడిపోవడం ఖాయం అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఇవాళ హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రేవంత్ రెడ్డి సర్కార్? ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నదని, ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ వారిని నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో వచ్చేది మా ప్రభుత్వామే అని మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను అభివృద్ధిలో డెవలపర్స్ గా చూస్తామన్నారు. ఉద్యోగులను సంతోష పెట్టేలా, వారిని గౌరవించేలా మా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు!:

తెలంగాణ ఉద్యమం సమయంలో ఉపాధ్యాయులంతా కూడా ఉద్యోగం కన్నా ఉద్యమమే ముఖ్యమని పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో 630 మండలాలకు కేవలం 8 మంది పర్మనెంట్ ఎంఈఓలు ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందించాలంటే పటిష్టమైన విద్యా పరిపాలన అవసరం అని విద్యార్థులకు పేషీయల్ రికగ్నేషన్, రిపోర్ట్ లు అంటూ టీచర్లు పాఠాలు చెప్పకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇక ఒకే టీచర్ ఉన్న స్కూళ్లలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమం చేయలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరు గొప్ప అమలు జరగడం లేదన్నారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలకు ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంకా స్పందించడం లేదన్నారు.

# ఏపీ రాజకీయాల్లో మరో విషాదం!

మొదటి పేజీ తరువాయి

ఏలూరు నుండి ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైసీపీ హయాంలో ఆరోగ్యశాఖమంత్రిగా సేవలు అందించారు. 1994లో ఏలూరు నియోజకవర్గం నుండి మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి ఓటమిపాలయ్యారు. 2004లో టీడీపీ అభ్యర్థి అంబికా కృష్ణపై 33,053ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు.

2009లోనూ కాంగ్రెస్ పార్టీ నుండి విజయం సాధించారు. తరవాత 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2019లో మరోసారి ఏలూరు నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు నియోజకవర్గంలో, వైసీపీలో కీలక నేతగా వ్యవహరించిన నాని మరణంతో ఇటు నియోజకవర్గంలో, అటు పార్టీలో విషాదచాయలు అలుముకున్నాయి.

# ఫలక్‌నుమా వేదికగా కీలక భేటీ!

మొదటి పేజీ తరువాయి

మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక కట్టడాలను కూడా ఈ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు.

పాతబస్తీలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం అందించాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని.. ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి భవనాన్ని వారసత్వ కట్టడంగా పరిరక్షించి అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని వివరించారు.

హైదరాబాద్‌లో మూసీ నది పునరుజ్జీవంతో పాటు దాని పరివాహక ప్రాంతాన్ని ఆర్థిక కార్యకలాపాలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీకి అనుగుణంగా అభివృద్ధి చేసే ప్రణాళికలను ప్రిన్స్ రహీమ్‌కు వివరించారు. వారసత్వ సంపద పరిరక్షణతో పాటు నగర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ ను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. ఈ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్స్ రహీమ్ వెల్లడించారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల దూరంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

తమిళనాడు సీఎం విజయ్ కామెంట్లపై స్టాలిన్ కౌంటర్లు

సింగపూర్‌కు చెందిన సంస్థ రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొత్తం 30 వేల ఎకరాల్లో 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, గ్రీన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు వివరించారు.

ఫలక్‌నుమా ప్యాలెస్‌లో సీఎం రేవంత్ రెడ్డి మరియు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ మధ్య జరిగిన చర్చలపై మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి. వారసత్వ సంపద పరిరక్షణ మరియు పాతబస్తీ అభివృద్ధి విషయంలో మీరు ఏ మార్పులు ఆశిస్తున్నారు?

# యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

మొదటి పేజీ తరువాయి



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** యూపీఐ లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రాజకీయ దుమారం రేపుతోంది. యూపీఐ లావాదేవీలపై ఫీజులు వసూలు చేయడానికి ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రూ. 2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించడానికి మోడీ ప్రభుత్వం అనుమతించిందన్నారు. రూ. 2,000 పైబడిన లావాదేవీల సంఖ్య కేవలం 5 శాతమే అయినప్పటికీ.. మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో సుమారు 65 శాతం ఈ లావాదేవీల నుంచే వస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా యూపీఐ ద్వారా రూ.2,000 వరకు చేసే లావాదేవీలపై.. అలాగే రూపే డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపై బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని కేంద్రం ఆదేశించింది. అయితే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై మాత్రం ఛార్జీలు పడనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది.

"మోడీ ప్రభుత్వం యూపీఐపై ఫీజులు విధించేందుకు నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. ఇప్పుడు రూ.2,000కు మించిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించవచ్చు. ఇలాంటి లావాదేవీలు పరిమాణం పరంగా కేవలం 5 శాతం ఉన్నప్పటికీ.. యూపీఐ మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయి" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించలేదు. ఇప్పటివరకు లావాదేవీ మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు లేవు.

'భారం వినియోగదారులపైనే' : యూపీఐ వినియోగదారులపై నేరుగా ఎలాంటి ఫీజులు ఉండవని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వ్యాపారులపై విధించే ఛార్జీల భారం చివరికి వినియోగదారులపైనే పడుతుందని రాహుల్ గాంధీ అన్నారు. "వినియోగదారుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ దుకాణదారులపై విధించే ఫీజులు చివరికి ఎక్కడి నుంచి వస్తాయి? ధరలు పెంచి.. నేరుగా వినియోగదారుల జేబు నుంచే వస్తాయి" అని వ్యాఖ్యానించారు. అమెరికాకు చెందిన పేమెంట్ కంపెనీలు చాలా కాలంగా భారత్‌లో అమలవుతున్న జీరో-ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చే దిశగా మార్గం సుగమం చేసిందని ఆరోపించారు.

# శంకర్‌పై రౌడీషీట్ రీ-ఓపెన్!

మొదటి పేజీ తరువాయి



ఒక సెటిల్‌మెంట్ వ్యవహారంలో తమకు అనుకూలంగా ఒప్పుకోవాలని, లేదంటే కుటుంబసభ్యులను చంపేస్తామని శంకర్‌తో పాటు ఆయన అనుచరులు బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా జూబ్లీహిల్స్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఆయనపై బెదిరింపుల ఆరోపణలు వచ్చాయి. గత జూన్‌లో గాజులరామారంలో బిల్డర్‌కు తెలియకుండా ప్లాట్లను విక్రయించిన ఘటనతో పాటు, ఒక న్యూస్ ఛానెల్ నిర్వాహకుడికి సంబంధించిన వివాదంలో మధ్యవర్తిగా ఉంటూ బెదిరించారనే ఆరోపణలపై కూడా శంకర్‌పై కేసులు ఉన్నట్లు సమాచారం. ఈ వరుస కేసుల నేపథ్యంలోనే అంబర్‌పేట్ పోలీసులు శంకర్‌పై మళ్లీ రౌడీషీట్ రీ-ఓపెన్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఏఐ పట్టించిన దొంగ



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** సోషల్ మీడియాలో ప్రస్తుతం 80s ట్రెండ్ నడుస్తోంది. 1980లో జీవించి ఉంటే నాడు తాము ఎలా ఉండేవారిమో చూసుకునేందుకు ప్రస్తుత ఫోటోలను ఏఐ సహాయంతో క్రియేట్ చేసి తమ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టులు చేస్తున్నారు. ఇన్ స్టా, ఫేస్ బుక్, ఎక్స్ ఏది ఓపెన్ చేసినా కాలం గిర్రున వెనక్కి తిరిగిందా అన్నట్లు అందరి వాల్స్ మీద 80ల నాటి ఫోటోలే దర్శనం ఇస్తున్నాయి. ఇండియాను ఊపేస్తున్న ఈ 80ల నాటి ట్రెండ్ 45 ఏళ్లుగా అంతుచిక్కకుండా పోయిన ఓ దొంగను పట్టించింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా సోషల్ మీడియాలో నడుస్తున్న ఈ ట్రెండ్ నాలుగు దశాబ్దాల నాటి కేసుకు ఫుల్ స్టాప్ పెట్టింది.

45 ఏళ్లుగా మారు పేరుతో..

ఇంటర్నెట్?లో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం.. మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని ఓ చిన్న స్వర్ణకారుడి దుకాణంలో ఓ యువతి 45 ఏళ్ల క్రితం బంగారు హారం కొట్టేసి అక్కడి నుంచి పారిపోయింది. ఆ తర్వాత పోలీసులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె ఎవరు? ఎక్కడికి వెళ్లింది? ఎలా అదృశ్యమైంది? అనేది సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో కాలం గడిచిపోసాగింది. ఇక ఆ యువతి తన పేరును మార్చుకుని ఎవరికి అనుమానం రాకుండా మరో వ్యక్తిలా జీవించడం మొదలు పెట్టింది.

తలకిందులు చేసిన ఏఐ టెక్నాలజీ: అలా 45 ఏళ్లుగా ఎవరికీ చిక్కకుండా జీవనం సాగిస్తున్న ఆ మహిళ ఇక అంతా ముగిసిపోయిందని అనుకుంది. కానీ 2026లో ఒక ఏఐ ఫొటో ఆమె జీవితాన్ని తలకిందులు చేసింది. 80ల నాటి ట్రెండ్‌లో తనను తాను చూపించుకోవాలనే సరదాతో ఏఐ తో ఓ పాతకాలపు ఫొటోను తయారు క్రియేట్ చేసుకుంది. ఆ ఫొటోను జ్ఞాపకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే ఆ ఫొటో ఆశ్చర్యకరంగా 45 ఏళ్ల క్రితం ఆ బంగారు హారం దొంగిలించబడిన దుకాణం యజమాని కంటపడింది. 45 ఏళ్ల క్రితం తన దుకాణంలో కనిపించిన ఆ యువతి ముఖం... ఇప్పుడు సోషల్ మీడియాలో కనిపిస్తున్న ముఖం ఒకే రకంగా ఉండటంతో ఆలోచనలో పడ్డాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో విచారణ జరపగా 45 ఏళ్ల క్రితం జరిగిన ఆ దొంగతనాన్ని ఆమె అంగీకరించింది. దీంతో 45 ఏళ్లుగా మూసుకుపోయిన ఆ కేసు మళ్లీ 80s ట్రెండ్ దెబ్బకు ఎండ్ కార్డు పడినట్లైంది.

# యువతకు సర్కార్ గుడ్ న్యూస్!




**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** రాజీవ్ యువ వికాసం పథకం విషయంలో కీలక అప్ డేట్ వెలువడింది. నవంబర్ 19 నుంచి రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులకు రూ.1 లక్ష వరకు స్వయం ఉపాధి ఆర్థిక సాయం అందించేలా చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పనితీరుపై ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

యువతకు స్వయం ఉపాధి కల్పనే మా లక్ష్యం:

ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల సంక్షేమం, విద్యాభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి కల్పనే మా ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని విద్యారంగ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని భట్టి స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును వేగవంతం చేయాలని, పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని సూచించినట్లు భట్టి తెలిపారు. అలాగే స్టడీ సర్కిళ్ల ద్వారా అత్యుత్తమ శిక్షణ, ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టే దిశగా నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు.

# విజయవాడలో బాంబుల కలకలం!




**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సిటీలో పేలుడు పదార్థాలు లభించడం తీవ్ర కలకలం రేపింది. నరసరావుపేట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులో భారీగా పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. ఓ ప్రయాణికుడి అప్రమత్తతతో విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్ అలీ అనే ప్రయాణికుడు నరసరావుపేట నుంచి విజయవాడకు బస్సులో ప్రయాణించారు. బస్సు దిగిన తర్వాత ఆయన పొరపాటున తనది కాని వేరే బ్యాగును తీసుకున్నారు.

కొంత సమయం తర్వాత ఆ బ్యాగును తెరిచి చూడగా అందులో పేలుడు పదార్థాలు ఉండటాన్ని గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే సమీపంలోని బస్టాండ్ పోలీస్ అవుట్ పోస్టుకు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆ బ్యాగును స్వాధీనం చేసుకుని పరిశీలించగా.. అందులో 46 జిలెటిన్ స్టిక్స్, 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి బస్సుతోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈ ఘటనపై కృష్ణలంక ఎస్సై గిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పేలుడు పదార్థాలను ఎవరు తీసుకొచ్చారు..? వీటిని ఎక్కడికి తరలిస్తున్నారు..? అనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్టాండ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను, ప్రయాణికుల వివరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి సమాచారం అందించిన ప్రయాణికుడు ఆసిఫ్ అలీని అధికారులు అభినందించారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం,
16 సెప్టెంబర్ 2026



## ఉత్తమ ఉపాధ్యాయుడు భాస్కర్‌కు ఘన సన్మానం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వెంకటేశ్వర్లపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పడిదెల భాస్కర్‌ను మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాడవేన సరిత--యుగేందర్,ఉపసర్పంచ్ పొన్నం రాజు,వార్డు సభ్యులు,ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించారు.విద్యార్థుల క్రమశిక్షణ,విద్యాభివృద్ధికి,పాఠశాల ప్రగతికి భాస్కర్ చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు.ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం గ్రామానికి,పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ గ్రామ పెద్దలు,సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం బాగిర్తిపేట గ్రామంలోని కామ్రేడ్ పెరుమాండ్ల వీరన్న స్తూపం వద్ద సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సభను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైడ్ల శాంతికుమార్ హాజరై ప్రసంగించారు. భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నైజాం నవాబు,భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో సాగిన మహోన్నత ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటమని వారు కొనియాడారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి,రావి నారాయణరెడ్డి తదితర నేతల నాయకత్వంలో



జరిగిన ఈ పోరాటంలో 4,000 మంది వీరులు ప్రాణత్యాగం చేశారని,దాదాపు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందని స్పష్టం చేశారు. చరిత్రను వక్రీకరిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నారపు రాజేందర్,మండల కార్యదర్శి పెంట రవి,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల కృష్ణమూర్తి,నాయకుడు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన రహదారికి మరమ్మతులు

### సర్పంచ్ రేణుక కుమారస్వామి చొరవతో గుంతల పూడ్చివేత



**ధర్మసాగర్, వేలేరు,సెప్టెంబర్ 15 (తెలుగు గళం):**

నారాయణగిరి నుండి వేలేరు మీదుగా వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చివేసి వాహనదారులకు ఇబ్బందులు తొలగించేందుకు గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక కుమారస్వామి చొరవ తీసుకున్నారు. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించిన సర్పంచ్, సంబంధిత సమస్యపై స్పందించి గుంతలను పూడ్చివేయించారు.రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉండటంతో గుంతల పూడ్చివేత చేపట్టడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించిన సర్పంచ్ రేణుక కుమారస్వామికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు కేశిరెడ్డి రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు ముంజ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వల్లపురెడ్డి సందీప్ రెడ్డి, నాయకులు వక్కల కర్ణాకర్, ఈర్ల రాకేష్, గొట్టిముక్కుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి 30 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 15**

స్టేషన్ ఘనపూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన సుమారు 30 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో మంగళవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో ఈ చేరికలు జరిగాయి.పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు వీరగోని అశోక్, భాస్కుల మానసతో పాటు నాయకులు భాస్కుల హరీష్, భాస్కుల వెంకటేష్, వీరగోని వెంకటేశం, పెద్దరబోయిన శ్రీను, వీరగోని పెద్దాపురం, కట్ల కుమార్, తోటకూర సోమేశ్వర్, ఎల్లబోయిన శ్రీహరి, భాస్కుల ఎల్లయ్య, కత్తుల రాజు, కట్ల పరుశురాములు తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని, వాటి ఫలితంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జూలూకుంట్ల శిరీష్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి వర్కింగ్ & విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ"





**సత్తుపల్లి, ఆర్ సి,సెప్టెంబర్15(తెలుగు గళం) న్యూస్:**

సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్ త్రైపాక్షిక సమావేశం, పెన్షన్ అదాలత్ నిర్వహించారు. సీఎంపీఎఫ్ కమిషనర్లు వంశీధర్ కుటుంబ, కనకమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని సీఎంపీఎఫ్ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో: ఏరియా జనరల్ మేనేజర్ సిరికొండ వెంకటాచారి, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సులోచన, ఎస్‌వోటూ జీఎం బొల్లం శ్రీనివాస్, ఎన్‌వీఆర్ ప్రహ్లాద్, బి. రాజేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. సుధాకర్, ఇంటక్ ఉపాధ్యక్షుడు బి. కోటేశ్వరరావు, సంక్షేమ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెండెల అశోక్ కుటుంబానికి లక్ష్మణ్ బాబు భరోసా.. తక్షణ ఆర్థిక సాయం

### కష్టకాలంలో అండగా బీఆర్ఎస్.. అశోక్ కుటుంబానికి ఆపన్నహస్తం



**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 15:**

ఏటూరునాగారానికి చెందిన పెండెల అశోక్ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సూచనల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, లక్ష్మణ్ బాబు పంపించిన తక్షణ ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు మెంబర్ గంప కిరణ్ తదితరులు, ఏటూరునాగారం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ 'భరోసా'

**బస్సు సర్వీసులను పరిష్కరిస్తున్న మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి సత్కరించిన ఆర్టీపి డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్**

**ములుగు జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు, నూతన బస్సు సర్వీసులకు ప్రతిపాదనలు**

**- ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్ఎమ్‌ను కలసి వినతిపత్రం ఇచ్చిన ఆర్‌టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్**

**- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు తక్షణమే స్పందించిన ఆర్టీసీ అధికారులు, బస్ సర్వీసు సమస్యల పరిష్కారానికి కృషి**



**తెలుగు గళం ములుగు సెప్టెంబర్ 15:**

ములుగు జిల్లాలోని సుదూర ఏజెన్సీ గ్రామాలు, మండల కేంద్రాలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ ముమ్మర చర్యలు చేపట్టింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ను ఇటీవల మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. పలు ఏజెన్సీ మండలాల్లోని పాత బస్సు సర్వీసులను పునరుద్ధరించడంతో పాటు నూతన రూట్లలో బస్సులు నడపాలని, పలు ప్రాంతాల్లో బస్టాండ్లు, రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని ఆర్ఎమ్‌కు శ్రీనివాస్ వివరించారు. మంత్రి సీతక్క చొరవ – హర్షం వ్యక్తం చేసిన ప్రజలు. వినతిపత్రంపై ఆర్ఎమ్ సానుకూలంగా స్పందించి సమాచారం అందించడంతో మంత్రి సీతక్క వెంటనే చర్యలకు ఆదేశించారు. ములుగు జిల్లాలో దీర్ఘకాలంగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రతి గ్రామానికి త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని, హన్మకొండ నుంచి ఏటూరునాగారం వైపు నిత్యం బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కను ఆర్‌టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ మంగళవారం కలసి ఘనంగా సత్కరించారు. ఏళ్లనాటి రవాణా కష్టాలు తీరనుండటంతో జిల్లా ప్రజలు, గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (తెలుగు గళం)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో పీఏసీ చైర్మన్ గాంధీని మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ..విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలోని సకల విఘ్నాలను తొలగించి విజయాలను అందించాలని, సమస్త శుభాలు, సంతోషాలను ప్రసాదించాలని వినాయకుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కలిగి ఉండడం మనందరి ధర్మమన్నారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు.ఈ వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రజలను కోరారు.

## వ్యభిచార ముఠా గుట్టు రట్టు"



**ఖమ్మం, సెప్టెంబర్15 (తెలుగు గళం) న్యూస్:**

మహిళలను వ్యభిచారంలోకి దింపుతూ ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామానికి చెందిన బాలకృష్ణ (30) జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ మహిళలను వ్యభిచారంలోకి తీసుకువస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు.బాలకృష్ణపై ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిపై పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జి గదిని అధిక మొత్తంలో డబ్బు చెల్లించి తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ వ్యవహారంలో బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. కాకినాడకు చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని ఆమెను వ్యభిచారంలోకి తీసుకువచ్చి ఖమ్మంకు తరలించి, లాడ్జి గదిలో ఉంచి కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించారు.నిందితుడి నేరప్రవృత్తిని అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం--1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం బాలకృష్ణను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలి

**• ఐద్వా జాతీయ కార్యదర్శి కనినిక గోష్**

**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి సెప్టెంబర్ 15**

చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి వీరవనితల పోరాట స్ఫూర్తిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ఐద్వా జాతీయ కార్యదర్శి కనినిక గోష్ పిలుపునిచ్చారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల ద్వారానే ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన వీరవనితల స్ఫూర్తి యాత్రను కనినిక గోష్ ప్రారంభించారు.ముందుగా వీరనారి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన సభకు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కనినిక గోష్, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతి మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాములు, దొరలు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా సాగిందన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రజలు ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటంతో ఉద్యమానికి బలమైన పునాది ఏర్పడగా, దొడ్డి కొమురయ్య అమరత్వంతో తెలంగాణ అంతటా పోరాట జ్వాలలు మరింత ఉద్ధృతమయ్యాయని అన్నారు.చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి మహిళా యోధుల ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహిళలపై దాడులు, అణిచివేతలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ పాత్ర లేదని అన్నారు. హిందూ మహాసభ నాయకులు భూస్వాములకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని హిందూ--ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనని విమర్శించారు. దొరలు, భూస్వాములు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా రైతులు, సబ్బండ వర్గాలు సాగించిన పోరాటాన్ని మతపరమైన ఘర్షణగా చిత్రీకరించడం ప్రజా పోరాటాన్ని అవమానించడమేనన్నారు. రాజకీయ లబ్ధి కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, టి.జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవేటి సరళ, కే.ఆశాలత, నలిగంటి రత్నమాల, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, బత్తుల హైమావతి, జిల్లా అధ్యక్షురాలు ఈవి.అహల్య, మోకు భవాని, సంపూర్ణ, వెన్నెల, లక్ష్మి,



పద్మతో పాటు ప్రజా సంఘాల నాయకులు చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, సోమ అశోక్‌బాబు, ముస్కు ఇంద్రారెడ్డి, ఎండీ శంషుద్దీన్, మంజుల, సంధ్యారాణి, పద్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన ఫక్రుద్దీన్"



**సత్తుపల్లి/ వేంసూరు, సెప్టెంబర్ 15 (తెలుగుగళం) న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఉచిత యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ఖమ్మంజిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూర్ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎండీ ఫక్రుద్దీన్ చేతుల మీదుగా విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని అలవాలా పుల్లమ్మ, ఉపాధ్యాయురాలు నందికొల్లా మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్స్ అందించడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. యూనిఫామ్‌లు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు పాఠశాలలకు హాజరు శాతం పెరిగేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని నిరంతరం ప్రోత్సహించాలని కోరారు.

## ఎంఎస్‌సీసీ తులసి మృతి"



సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్15(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో ఎంఎస్ సీసీగా విధులు నిర్వహిస్తున్న కే. తులసి అనారోగ్యంతో మంగళవారం రాత్రి 11.24 గంటలకు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొర్లమండ గ్రామంలో బుధవారం ఖమ్మం సెర్ప్ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో తులసి కుటుంబాన్ని పరామర్శించారు. ఏపీడీ జయశ్రీ చేతుల మీదుగా తులసి కుమారుడికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.30 వేల నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో: డీపీఎం ఐబీ ఆంజనేయులు, వివిధ మండలాల ఏపీఎంలు,సుబ్బారావు, సిబ్బంది,ప్రసాద్, డీఎంజీలు, ఎంఎస్‌ఏలు,వీఓఏలు తులసి మృతదేహానికి నివాళు లర్పించారు.

## సాయిస్ఫూర్తి కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు"



సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్15(తెలుగు గళం) న్యూస్: సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల జాతీయ సేవా పథకం విభాగం, యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో విశిష్ట సేవలందించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్ మాట్లాడుతూ జ్ఞానం, ఆవిష్కరణలు, క్రమశిక్షణ, అంకితభావంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, డిప్లొమా డీన్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి బలుసుపాటి సీతారాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యదేవ ఫ్రెండ్స్ సర్కిల్ గణనాథుడిని దర్శించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు

**తెలుగు గళం న్యూస్ పామిడి సెప్టెంబర్ 15**



పామిడి పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ సత్యదేవ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్వయం సేవకులు వినాయక మండపాన్ని సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వయం సేవకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.ప్రొద్దుటూరు శ్రీ శ్రీధర్ జువెలర్స్ యాజమాన్యం వితరణ చేసిన వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.ఈ పూజా కార్యక్రమంలో పట్రా శ్రీనివాసులు, రాజశేఖర్ గౌడ్, జోజోడే కుమార్, చౌహాన్ అంజినాయక్, ప్రొద్దుటూరు శ్రీధర్, పవన్, తలారి తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ సత్యదేవ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులతో పాటు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.

## మరిపెడ నూతన కోర్టు భవనాన్ని పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి.

**ఈ నెల 19న నూతన కోర్టు భవనం ప్రారంభోత్సవం.**

**సీనియర్ సివిల్ జడ్జి,న్యాయ సేవ సాధికారత సంస్థ చైర్మన్ స్వాతి మురారి**

**మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి.**



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయపోతున్న కోర్టు భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో మంగళవారం భవనాన్ని సీనియర్ సివిల్ జడ్జి,మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ చైర్మన్ స్వాతి మురారితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పరిశీలించారు.ఈ నెల 19న నూతన కోర్టు భవనం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో భవనంలో చేపట్టిన ఏర్పాట్లు,వసతులను పరిశీలించి సంబంధిత వివరాలను తెలుసుకున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు,పరిసరాల పరిశుభ్రత,మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులు,ప్రజాప్రతినిధులతో చర్చించారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కృష్ణవేణి,సీఐ పవన్ కుమార్,ఎస్సై సతీష్,తొర్రూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరదాసు వెంకట రత్నం,మహబూబాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ,ఏజీపీ లింగాల శ్రీను,తొర్రూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి తోనుకనూరి సైదులు,జై సిద్ధార్థ,కొర్రా మున్నా తదితరులు పాల్గొన్నారు..

## మా తండాలో,మా రాజ్యం

**గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు**

**17వ తారీఖున కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని పిలుపు**

**మాజీ మంత్రి డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డి ఎస్ రెడ్యా నాయక్**



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకుల సమావేశం నవీన్ రావు గెస్ట్ హౌస్ లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా డోర్నకల్ మాజీ శాసనసభ్యులు,డిఎస్ రెడ్యా నాయక్ హాజరయ్యారు,మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెడ్యా నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు స్వర్ణ యుగం కెసిఆర్ పాలన అన్నారు,అపన్ తాండెమా..అపన్ రాజ్ తో ఆత్మగౌరవానికి అంకురార్పణ చేసారు,గిరిజనుల అభివృద్ధి అంటే ఆర్థిక ప్రగతి మాత్రమే కాదని.. వారి చరిత్ర సాంస్కృతి సాంప్రదాయాలకు గౌరవం కూడా అంతే ముఖ్యమని కేసీఆర్ ప్రభుత్వం చాటి చెప్పింది అన్నారు,తండాలో పుట్టిన బిడ్డకు చేతిలో పుస్తకం...రైతు చేతిలో పట్టా... సాగుకు పెట్టుబడి... యువత చేతికి నైపుణ్యం...కుటుంబానికి సంక్షేమ భరోసా తండాకు స్వయంపాలన.. ఈ మార్పులన్నిటికీ ఒకే అభివృద్ధి దిశగా నడిచిన నాయకత్వం కేసీఆర్ ది అన్నారు,

ఈనెల 17న తండా తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని పిలుపు

తెలంగాణ రాష్ట్రంలో 6% శాతం ఉన్న గిరిజనులకు జనాభా ప్రాతిపదికన 6% శాతం నుండి 10% శాతం రిజర్వేషన్లను పెంచిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ కి తండా,తండాలో పాలాభిషేకాలు చేసి మన జాతి అభివృద్ధికి పాటుపడినందుకు కృతజ్ఞతలు తెలియజేద్దాం అని తెలిపారు,

మా తండాలో మా రాజ్యం మా తండాలను గిరిజన గూడాలను 3146 ప్రత్యేక గిరిజన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన కెసిఆర్ కి రుణపడి ఉంటాం అన్నారు,

ఈరోజు గిరిజనులకు 3146 మంది సర్పంచులుగా 25 వేలకు పైగా వార్డు సభ్యులుగా రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు అంటే అది కెసిఆర్ పుణ్యంమే అని తెలిపారు,

అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులు మా తండాలకి వచ్చి తండాలు అభివృద్ధి చెందుతున్నాయి కనుక మా తండాలను ప్రత్యేక పంచాయతీ కేటాయించిన బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి హరీష్ రావు కి జాతి మొత్తం ఋణ పడి ఉంటాంమని తెలియజేస్తున్నాను అన్నారు

అందుకోసమే ఈ నెల 17న ప్రతి తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని తెలుపునిచ్చారు.

కెసిఆర్ పాలనలో తమకు జరిగిన అభివృద్ధిని గుర్తుచేసుకుంటున్న గిరిజనులు.. మళ్లీ కెసిఆర్ నాయకత్వమే రావాలని కోరుకుంటున్నారు గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడి వారి హక్కులకు భరోసా ఇచ్చే పాలన కావాలంటే అది కెసిఆర్ తోనే సాధ్యమని గిరిజన్లో బలమైన ముద్రపడ్డది అన్నారు,

"మళ్లీ కెసిఆర్ తోనే గిరిజన సంక్షేమం.. స్వర్ణ యుగం"అనే ఆకాంక్ష గిరిజన గుడాలలో బలంగా వినిపిస్తుందని అని తెలిపారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీపీ అరుణ రాంబాబు నాయక్, మాజీ జడ్పిటిసి శారద రవీందర్ నాయక్, గడ్డం వెంకన్న నాయక్, కురవి మాజీ ఎంపీపీ పద్మావతి రవి నాయక్,కాలు నాయక్, తాళ్లపల్లి శ్రీనివాస్,అజ్మీర రెడ్డి,మాజీ అధ్యక్షులు,కౌన్సిలర్లు,గిరిజన సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ గిరిజన నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కొత్తల పండుగకు సెలవు ప్రకటించాలి

**సెప్టెంబర్ 16, 17 తేదీల్లో ఆదివాసీ ప్రాంతాల పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ఇవ్వాలి -- తుడుందెబ్బ డిమాండ్**

**తెలుగు గళం ములుగు, సెప్టెంబర్ 15:**

ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ప్రతి సంవత్సరం ఉత్తర కార్తీ మొదటి బుధవారం, గురువారాల్లో నిర్వహించే కొత్తల పండుగ (పెద్దల పండుగ)ను ఈ నెల 16, 17 తేదీల్లో ఆదివాసీ ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకోనున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం సురేష్ తెలిపారు. కొత్తల పండుగ ఆదివాసీ సమాజానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన పండుగ అని, నూతనంగా వివాహమైన వధూవరులను కుల పెద్దలకు పరిచయం చేసి పెద్దలలో కలుపుకోవడం, పూర్వం నుంచి ఇప్పటివరకు మరణించిన కుటుంబ పెద్దలను స్మరించుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. పెద్దలకు ఇష్టమైన దూప, దీప, నైవేద్యాలు సమర్పించి, సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న ఆదివాసీ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. కావున ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆదివాసీ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 16, 17 తేదీల్లో సెలవు ప్రకటించాలని జిల్లా



కలెక్టర్‌ను కోరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తుడుందెబ్బ తరఫున విజ్ఞప్తి చేశారు.



## హనుమకొండలో ఆర్టీసీ బస్సుపై కూలిన భారీ వృక్షం

**పబ్లిక్ గార్డెన్స్ వద్ద తప్పిన పెను ప్రమాదం**

**నుజ్జునుజ్జయిన వాహనాలు**

**తెలుగు గళం హనుమకొండ సెప్టెంబర్ 15**

హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ సమీపంలోని ప్రధాన కూడలి వద్ద మంగళవారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. సిరిసిల్ల డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు (టిఎస్ 23 టి 8923) విద్యుత్ వైర్లకు చుట్టుకోవడంతో సమీపంలోని భారీ వృక్షం ఒక్కసారిగా నేలకొరిగింది. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..హనుమకొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు పబ్లిక్ గార్డెన్స్ వద్ద ఉన్న తీవ్రమైన మూలమలుపు వద్ద వేగంగా దూసుకొచ్చింది.ఈ క్రమంలో విద్యుత్ వైర్లు బస్సుకు చుట్టుకోవడంతో పక్కనే ఉన్న భారీ చెట్టును ఢీకొట్టినట్లు తెలుస్తోంది.దీంతో చెట్టు ఒక్కసారిగా రహదారిపై కూలిపోయింది.

నుజ్జునుజ్జయిన వాహనాలు

చెట్టు కూలిన సమయంలో దాని కింద పార్క్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే ఆ సమయంలో వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రహదారిపై కూడా జనసంచారం తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం జరగకుండా బయటపడింది.సమాచారం అందుకున్న వెంటనే కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకటరత్నం సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు.రహదారిపై, బస్సుపై పడిన చెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.ప్రమాదానికి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.ప్రాణనష్టం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State, Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.